జిందగీ
చైతన్య
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 12 ఆగస్టు 2024
www.ntnews.com

నీ ఉన్నతి నీ చేతిలోనే

ఉద్ధరే దాత్మనాఽత్మానం నాత్మానమవసాదయేత్।
ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః॥
(భగవద్గీత 6-5)

ప్రపంచంలో ప్రతివ్యక్తీ తనను తానే ఉద్ధరించుకోవాలే కానీ పతనావస్థను పొందకూడదు. ప్రపంచంలో తనకు తానే బంధువు.. తానే శత్రువు అంటున్నాడు కృష్ణపరమాత్మ. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' సాంసారిక బంధాలకు లేదా విముక్తికి కారణమైన మనసు వలలో చిక్కితే బంధనాలు.. దానిని జయిస్తే.. విముక్తి. మనసును జయించినవాడే ఆత్మవంతుడు, ప్రశాంతుడు, విజయసాధకుడు. గురువులు, శాస్త్రాలు, దేవుడు.. ఇవన్నీ మార్గాన్ని చూపుతాయే కాని నడవవలసింది మాత్రం మనమే! పంచభక్షపరమాన్నాలను బల్లపై ఉంచినా.. మనకాళ్లతోనే అక్కడికి నడవాలి. మన కండ్లతోనే చూడాలి. మన చేతులతోనే తినాలి. వందమంది అనుభవజ్ఞులైన వైద్యులు తనచుట్టూ ఉన్నా క్షయరోగి తన దగ్గ తానే దగ్గాలి.

ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలనే తపన అణువణువునా రగిలిపోయే వ్యక్తి ఉన్నత శిఖరాలకు చేరగలుగుతాడు. సోమరులై, ఇంద్రియలోలురై, ప్రవాహాన్ని అనుసరించి నడిచేవారిని ఏ దేవుడూ ఉద్ధరించడు. అనుక్షణం మన మనసు ధర్మాధర్మ విచికిత్స చేస్తూనే ఉంటుంది.. యుక్తమైన దానిని ఆదరిస్తే.. జీవితలక్ష్యం నెరవేరుతుంది. ఎవరైనా సహాయం చేస్తారు లేదా భగవంతుడే ఉద్ధరిస్తాడనే భావన పనికి రాదు. ఆరుపాళ్లు నువ్వు ప్రయత్నిస్తే.. ఒకపాలు భగవంతుడు సాయపడతాడు. తనను తాను ఉన్నతీకరించుకునే వ్యక్తికే భగవంతుడు కూడా సహాయకారిగా ఉంటాడనే సామెత ఉన్నది.
త్రికరణశుద్ధిగా భగవంతుని నమ్మిన భక్తుడొకరు భాగవతం చెబుతున్నాడు. ఊరి పక్కన ఉన్న చెరువుకట్ట తెగి నీరు ఊరిలోకి వస్తున్నది. ఒకరు, ఇద్దరూ, ముగ్గురూ ఇలా పదిమంది వచ్చి నీటిప్రవాహం ఉధృతంగా ఉన్నదని, అందరూ వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారు. ఒక్కొక్కరుగా శ్రోతలంతా అక్కడినుంచి వెళ్లారు. భక్తుడు మాత్రం భగవంతుడే తనను కాపాడతాడని అక్కడే ఉండిపోయాడు. ప్రవాహవేగం అధికమై చివరకతను ప్రవాహంలో పడి ప్రాణాలు విడిచాడు. భగవంతుని వద్దకు చేరుకున్న భక్తుడు 'నన్నెందుకు రక్షించలేదు' అని దేవుణ్ని నిలదీశాడు. అప్పుడు భగవంతుడు 'పలుమార్లు వివిధ వ్యక్తుల రూపంలో వచ్చి నేను హెచ్చరించాను. నీవే మూర్ఖంగా వచ్చిన అవకాశాలన్నిటినీ చేజార్చుకున్నావు' అని చెప్పాడు. ఎవరో వచ్చి ఉద్ధరిస్తారనే భావన సరైనది కాదు. ప్రయత్నం కర్మఫలాన్ని కూడా మార్చుతుందని చెబుతుంది యోగవాసిష్ఠం. అవకాశాలు వచ్చి చుట్టూ పలకరిస్తున్నా.. వాటిని గుర్తించలేని గుడ్డివారిని భగవంతుడు కూడా రక్షించలేడు.
భౌతిక ఆకర్షణల వలయంలో చిక్కి, జీవిత గమ్యానికి దూరమైన వాడిలో జాత్యంతరీకరణ జరగదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతూ.. మనసును తన అధీనంలో పెట్టుకొని ముందుకు సాగేవానికి మనసే బంధువుగా సాయపడుతుంది. ఆటంకాలు కలుగుతాయనే భ్రాంతిలో, ఆ ఆలోచనలనే మనసుకు సూచనలుగా ఇస్తే.. ఆ మనసే శత్రువై అన్ని కార్యాలయందు అపజయాన్ని ఇస్తుంది.
ఉనికిలోనే శూన్యత్వాన్ని, శూన్యత్వంలోనే ఉనికిని

గుర్తించగలిగిన వారే అవకాశాలను అందిపుచ్చుకుంటారు.. విజయాన్ని సాధిస్తారు. నిరంతర సాధన, ఆధునీకరణే విజయానికి దగ్గర దారి. ఇతరుల మెప్పుకోలు మనలో ఆశలను, అహంకారాన్ని పెంచుతుంది.. అదే మనస్థాయిని నిర్ణయిస్తే వారికి మనం బందీలమైనట్లే. ఇతరుల ఆలోచనల ప్రకారం లేదా అభిప్రాయాల ప్రకారం నడవడం కాకుండా మన అంతరంగం ఏం చెపుతున్నదో ఆ విధంగా నడిచేవాడే మార్గదర్శకుడు అవుతాడు. జీవిత ప్రయాణంలో అంతరంగమే కేంద్రం కావాలి.. బాహ్యమైన అంచులలో ఇతరుల అభిప్రాయాలు నిలవాలి. అప్పుడే మనసు నీ అధీనంలో ఉంటుంది.. భౌతిక జగత్తులో ప్రగతి ఆధ్యాత్మిక జగత్తులో సుగతి కలుగుతుంది.

...✍ పాలకుర్తి రామమూర్తి

ప్రభువులో నివాసం



మానవ జన్మ సార్థకం కావాలన్నా, జన్మ ఫలం పరిపూర్ణం కావాలన్నా.. 'ప్రభువు మనిషిలో, మానవుడు ప్రభువులో నివసించాల'ని ప్రభువే సూచించాడు. ముందుగా మానవుడు ఆయన్ను ఆహ్వానిస్తే.. ఆ తర్వాత ఆయన మానవుడికి ఆతిథ్యం అవుతాడు. ఇక్కడ పరస్పర ప్రేమానురాగాలు చాలా సూక్ష్మంగా అంతస్సూత్రంగా కనిపిస్తున్నాయి. క్రైస్తవం అంటే క్రీస్తుకు సంబంధించింది. 'ఏవిధమైన సంబంధం అది?'. ఆయనతోడి నిరంతర బంధం. ఆయన లేకుండా మనం ఏ పనీ చేయలేం. మన ప్రతిపనికీ ఆయనే ముందుంటే.. విజయం గాక, ఫలితం మరొకటి ఎదురవుతుందా? అందుకే ప్రభువు ఇలా అంటాడు. 'ఎవడు నాయందు నిలిచి ఉండునో, నేను ఎవని యందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును' (యోహాను 15:5) ఇలా పలకడంలో అర్థం ఇదే. కాబట్టి మనిషి ఆయనతో లగ్నం కావడం తథ్యం. అది అనివార్యం.
ఆయన ఒక ద్రాక్షపాదు అయితే, మనమంతా దానికి అల్లిబిల్లిగా అల్లుకున్న ఆ ద్రాక్షావల్లులం, పువ్వులం. ద్రాక్ష కాండకు సంబంధం లేనివి ఏవైనా సరే, ఎండిపోతాయి. ఆ వల్లుల్ని, ఆ రెమ్మల్ని ఊరకే అలా ఎవరూ ఉంచరు. ఉన్నా చెట్టుకే ముప్పు. పచ్చదనం అందమూ దెబ్బతింటుంది. అందుకే విరిచేస్తారు. అందుకే ద్రాక్ష పాదు లాంటి ఆ ప్రభు బంధంతో నివసించాలనేది క్రైస్తవుల నమ్మిక. ఒకే పాదు వల్లికలన్నిటికీ ఒకే పచ్చదనం సమైక్యత ప్రకటిస్తుంది. ఇలా ఉండటం అనేది ప్రభువు పట్ల వారి అచంచల విశ్వాసానికి, కార్యనిమగ్నతకు ఒక తార్కాణం ! ఆయన వల్ల పరిపూర్ణ ప్రేమ, మేధా సంపత్తి, శక్తి సామర్థ్యాలు, దయాదాక్షిణ్యాలు లభిస్తాయనేది వారి విశ్వాసం!

...✍ ప్రొ॥ బెర్నార్డ్ రాజు,
98667 55024

శుకముని పరీక్షిత్తుతో.. రాజా! ఆ హేమంత రుతువు ప్రథమ మాసం మార్గశిరంలో మొదటి రోజున నందుని మంద(గొల్లపల్లె)లోని ఇందువదనలు— గోపకన్యలు వేకువలో ముందుగా నిద్రలేచారు. ఆనందంగా కాళిందీ నదికి వెళ్లి స్నానాలు చేశారు. గట్టున ఇసుకతో అందంగా గౌరీదేవి ప్రతిమను రూపొందించి, పుష్పాలతో అలంకరించారు. చందనం అలది, ధూప దీపాలతో అర్చించి పలు విధాల నైవేద్యాలు అర్పించారు. ఇలా నెల పొడవునా హవిష్యాన్నం భుజిస్తూ నెలతలు- గోపకాంతలు శ్రీపతిని- కృష్ణుని పతిగా కోరి కాత్యాయనీ వ్రతం ఆచరించారు.



చేలాపహరణ లీలా పరమార్థం



కం॥ ఓ కాత్యాయని! భగవతి!
నీకున్ మ్రొక్కెదము నేము నేడనుకంపన్
మా కిందరకును వైశమ
శ్రీకృష్ణుడు మగడు గాగ జేయుము తల్లీ!

భగవతీ! ఓ కాత్యాయనీదేవీ! నీకు అనేక వందనాలు. దయతో మా అందరికీ తొందరగా నందసుతుని పతిగా ప్రసాదించవమ్మా!

కం॥ ఓ తల్లి! మాకు కృష్ణుడు
చేతో విభుడైన నాడు చెలువల మెల్లన్
నేతి వసంతము లాడుచు
జాతర సేసెదము భక్తి చాతురి తోడన్

'ఓ అమ్మా! ఉమాదేవీ! మాకు మా(లక్ష్మీ)పతి మగడు అయిన నాడు మేమందరమూ నేతి వసంతాలాడుతూ, పాడుతూ భక్తితో కడు వేడుకగా నీకు జాతర చేస్తాం' అంటూ కాత్యాయనీ దేవిని కటాక్షించమని కోరేవారు. 'భూయాన్నంద సుతః పతిః' (శ్రీకృష్ణుడు మగడు గాగ జేయుము) అన్న అష్టాక్షరీ మంత్రాన్ని ఆర్తితో నిష్ఠగా జపించేవారు. ''పాతి ఇతి పతిః'' పతి అనగా రక్షించువాడు అని అర్థం. సర్వరక్షకుడు కనుక శ్రీహరియే నిజమైన పతి. తనకే రక్షణ లేని జీవుడు మరో జీవుని ఎలా రక్షించగలడు? 'నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా' అనికదా మన ప్రార్థన! శ్రీపతి పతి అయితే ఏ సతికీ దుర్గతి— వైధవ్య దుఃఖం లేదు.
'కతి అయనాని మోక్షమార్గాః సంతి'— మోక్షానికి ఎన్ని మార్గాలున్నాయి?— అంటూ విచారణ చేసేవాడు కత్యయనుడు. బ్రహ్మవేత్త ఐన కత్యయన మహర్షికి ఒక కల్పంలో పుత్రికగా ఆవిర్భవించిన కారణాన అమ్మవారికి 'కాత్యాయని' (బ్రహ్మ విద్య) అని పేరు. నందనందనుడు గోవిందుని పొందుకోరి కుందరదనలు— గోపికలు గానం చేసిన— 'ఓ తల్లి మాకు కృష్ణుడు..' అన్న కంద పద్యం పోతన్న గారి సొంతం.

రాజా! ఆ గజగమనలు యమునా తీరం చేరి ఒక విజన (ఏకాంత) స్థలంలో వలువలు— చీరలు విడిచారు. కళంక రహితలైన ఆ పంకజనేత్రలు జంకు లేక జలకాలాడటానికి జలంలో దిగారు. వారిజాక్షుని— కృష్ణునిపై పాటలు పాడుతూ అవ్వారిగా— తమ ఇచ్ఛ కొలదీ వారి (జల) విహారాలు— జలక్రీడలు ఆడారు. రాజా! వారి— గోపికల విహరణలు.. గోవిందుని స్మరిస్తూ వారు పొందిన ఆనంద పారవశ్యాలు లోకంలోని వారికి— ఇతరులకు ఎందైనా ఉన్నాయా? ఆ తోయజ(పద్మ)నేత్రలు యమునా నదీ తోయాలలో (జలాలలో) దిగంబర స్నానాలు చేస్తున్నారని, దూరగుడైనా— దూరంలో ఉన్నా సర్వపారగుడు (సమర్థుడు) తోయజాక్షుడు యోగేశ్వరేశ్వరుడు శ్రీకృష్ణుడు తెలుసుకొని, వారిని అనుగ్రహించాలని వ్రతం చివరి రోజున త్వరిత గతిని తోడి గోపబాలురతో అచ్చటికి విచ్చేశాడు. కదలకుండా ఇక్కడే ఉండండని తోడివారికి కనుసైగ చేసి, సరిగా సమయం చూసి ఆ గొల్ల చెలువల— గోపికల వలువలు దొంగిలించి ఒక కదంబ వృక్షం— కడిమిచెట్టు ఎక్కి కూర్చున్నాడు. పరమార్థంలో... గోపికల 'అనాది అజ్ఞాన ఆవరణ'మనే అంబరా(చీర)లను అపహరించాడు. కృష్ణుడు అంటేనే కర్షించే— లాగివేసే వాడని అర్థం. ఏమిటి ఆ లాగేది అంటే.. జీవులకున్న 'దేహమే నేను' అన్న అభిమానమనే అజ్ఞానాన్ని— దేహాత్మబుద్ధిని. 'గోపాయితుం ఇచ్ఛతి ఇతి గోపీ'— తన్ను తాను మరుగుపరచుకొనే— దాచుకొనే ప్రయత్నమే గోపీత్వం— జీవత్వం. ఇలాంటి బుద్ధి— స్వభావం ఉన్నంతవరకు జీవులందరూ స్త్రీలే— గోపికలే. సృష్టిలో ఒక్క జగన్నాథుడే పురుషుడు! అట్టి పురుషోత్తముని పరోక్షమని భావిస్తూ సిగ్గుతో బెదిరిపోయే స్వభావం కలవారే గోపికలు. వారు వారిజాక్షుని వస్త్రాలిమ్మని వేడుకొన్నారు. బతిమలాడారు..

కం॥ మామా వలువలు ముట్టకు
మామా! కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మానమేల కొనియెదు? మా
మానస హరణమేల? మానుము కృష్ణా!

మామా! మా కోకలు ముట్టుకోమాక, పట్టుకుపోమాక, మమ్ములను మన్నించు. మా మానమెందుకు హరిస్తావు? మా మనస్సులను ఎందుకు దోచుకుంటావు? నీకు వావి వరుసలు ఉన్నట్లు లేదు. అయినవారు, కానివారు అన్న వివేకం ఉండాలి కదా? కృష్ణా! నీ గుట్టు కనిపెట్టామయ్యా. ఈ తుంటరి పనులన్నీ మానుకో. రాజీవలోచనా! మేము అబలలం. మా చీరలు మాకు ఇవ్వకుంటే ఈ విషయం నందరాజుకు చెపుతాము.

శా॥ ఇంతల్ తోయము లాడుచుండ మగవారేతెంతురే? వచ్చిరా
యింతల్ సేయుదురే? కృపా రహితులై యే లోకమందైన నీ
వింతల్ నీ తల బుట్టెగాక మఱి యేవీ కృష్ణ! యో చెల్ల! నీ
చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబు లిప్పింపవే!'

'కృష్ణా! ముగుదలు స్నానాలు చేస్తుంటే మగవారు ఆ పరిసరాలకు రావచ్చునా? వచ్చారే పో, జాలిలేక రెచ్చిపోయి ఇలా నొచ్చుకొనే అల్లరి పనులు చెయ్యొచ్చా? ఔరా! ఈ వింత చేష్టలు నీకే చెల్లాయి. కృష్ణా! నీకు దాస్యం చేస్తూ నీ చెంతనే పడి ఉంటాము. మా పటములు— చీరలు మాకిప్పించు'. పై శార్దూల వృత్తం పోతన అమాత్యుల చిత్త సంజాతం— స్వీయం. 'ఇంతల్ సేయుదురే' అన్న మాటలో ఎంత కవిత్వముందో! అది భావుక భక్తులకు ఆలోచనామృతం!
పరమాత్మ ఇలా పలికాడు.. 'ఏ పడుచువాణ్ని పతిగా కోరి మీరు ఈ కాత్యాయనీ వ్రతం చేశారో చెప్పండి. అబద్ధమాడితే మీ మీద ఒట్టు. ఈ వలపు మీతోనే పుట్టింది కాదు. ఇల(భూమి)పై అంతటా ఉన్నదే. 'నేను' పరాయివాడనా? 'ఎఱుగనే మీలోన నెప్పుడు నున్నాడ, నేను జూడని మర్మమెద్ది గలదు?'— నేను ఎప్పుడూ అంతర్యామిగా మీలోనే ఉన్నాను. ('ప్రజ్ఞానం బ్రహ్మ'— తెలివే స్వరూపంగా ఉన్నవానికి తెలియనిదంటూ ఏదైనా ఉంటుందా? సర్వజ్ఞునికి మరుగు, మర్మములనేవి ఉంటాయా?) నాకు తెలియని, నేను చూడని రహస్యమేముంది కనుక? దాసుని దోషాలు దండంతో సరి! నాకు నమస్కరించి మీమీ వస్త్రాలు పుచ్చుకోండి.' పరమార్థంలో కృష్ణుడు లేని, కృష్ణుడు కాని గోపిక ఉందా? మట్టి లేని ఘటం (కుండ) ఉంటుందా? తంతువు (దారం) లేని పటం (వస్త్రం) ఉంటుందా? శ్రీశుకులు— రాజా! చాలా సేపు మథనపడి, చివరకు ఎలాగో మనసులు దిట్టపరచుకొని ఆ బాలలందరూ ఒక చేతితో మర్మాంగం మాటు పరచుకొని నీటి నుంచి వెలికి వచ్చి, ఒంటిచేతితో కొంటె కృష్ణునికి వందనం చేశారు. పరమాత్మ.. 'అయ్యో! ఒకటికి రెండు తప్పులు! వ్రతదీక్షలో దిగంబర స్నానం వరుణదేవునికి అపచారం. అంబికాదేవికీ అపరాధమే. ఏకహస్తాభివాదనం భగవదపచారం. ఆ చేతిని ఖండనం— నరకడమే దానికి దండనం! మీకు వ్రత ఫలం దక్కాలంటే చక్కగా రెండు చేతులూ ఎత్తి నాకు నమస్కరించండి' అన్నాడు. వ్రతఫలం దక్కదనే సరికి వ్రేతలందరూ వెతచెంది వెంటనే నుదుట చేతులు జోడించి, ఒయ్యారంగా వంగి భగవంతుడు హరికి వందనం చేశారు. స్వామి సంతసించి వారి మృణ్మయ వస్త్రాలను చిన్మయం చేసి, మాంసపిండాలను— దేహాలను మంత్రమయం గావించి అనుగ్రహించాడు. రాసలీలా ప్రవేశానికి అర్హత కలిగించాడు.

ఈ లీలా సమయానికి గోపబాలునికి ఏడేళ్ల వయసు. పరమార్థం విచారించక కేవలం బాహ్యార్థం చూచి ఆధునిక విమర్శకులు అశ్లీల ప్రసంగమని ఆక్షేపిస్తారు. జీవుడు వాస్తవానికి సచ్చిదానంద స్వరూపుడే! కాని, ఆ స్వరూపం పంచకోశాలనే ఆవరణలతో (స్థూల శరీరం అన్నమయకోశం; ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలు సూక్ష్మ (లింగ) శరీరం; ఆనందమయ కోశం కారణ శరీరం) కప్పబడి ఉంది. ఈ ఆవరణలు తొలగితేనే ఆత్మస్వరూప దర్శనం. శరీర త్రయ తాదాత్మ్యం (దేహమే నేను అనే అభేద బుద్ధి) తొలగించుటే చీర హరణం.
లోకంలో రసం— ఆనందం అనుభవానికి ఎప్పుడు వస్తుంది? తల్లికి, పాలు తాగే పిల్లకీ మధ్య వస్త్రమనే అడ్డు ఉన్నంతవరకు తల్లికి వాత్సల్యరసానుభవమూ ఉండదు. బిడ్డకి పాలు తాగే అవకాశమూ ఉండదు. అంతేకాదు, వస్త్రమనే ఆవరణ తొలగనిదే లోకంలో దాంపత్య— శృంగార రసాస్వాదనకు కూడా అవకాశం కలుగదుగా! అలాగే, ఆవరణ భంగం కానిదే రాసలీలా రసానుభూతి కూడా లేదు. వస్త్రాపహరణం ఆవరణ భంగలీల! రాసలీల జీవ బ్రహ్మ ఐక్యలీల! రాజా! ఇలా నారాయణుడు ఇచ్చిన చీరలను ఆ నారీమణులు ధరించి నందకిశోరుని ఆనందంగా అవలోకిస్తూ అక్కడే కదలకుండా నిలబడిపోయారు. చతురనటమూర్తి వారి చెంతకు చేరి.. 'అటమీద రాత్రులయందు మీకు నన్ను బొందగల్గు నమ్మిపొండు'— రాగల రాత్రులందు మీకు నా కలయిక లభిస్తుంది. నా మాటలు నమ్మి మీరు ఇళ్లకు వెళ్లండి— అని చెప్పగా వ్రతఫలం దక్కిందని ముకుందుని చరణారవిందాలను మదిలో స్మరిస్తూ ఆనందంగా నంద గోకులం వెళ్లిపోయారు. ప్రపంచ జ్ఞప్తి— స్ఫురణలేని రాత్రివేళ, గాఢ సుషుప్తిలో 'నన్ను బొందగల్గు'— నాయందు ఐక్యం కాగలరు అని పరమార్థం!

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)



దైవబలం మనోబలం

ఓ గ్రామంలో దేవుడి మీద నమ్మకంలేని ఒక యువకుడు ఉండేవాడు. అదే గ్రామంలోని గుట్టమీద సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. ప్రతి నెలా కృత్తిక నక్షత్రం నాడు స్వామివారికి గ్రామస్తులు ప్రత్యేక అభిషేకం చేసేవారు. ఆ రోజు కృత్తిక. ఊళ్లో వాళ్లంతా పూజ సామగ్రి తీసుకొని బయల్దేరుతున్నారు. గుడికి వెళ్తూ ఊరి పెద్ద ఆ యువకుడిని అభిషేకానికి రమ్మని పిలిచాడు. 'నేను రానంటే రాను' అని మొండికేశాడు ఆ యువకుడు. అతను మొండికేసే కొద్దీ ఊరిపెద్దలో కూడా పట్టుదల పెరిగింది. మరింత గట్టిగా గుడికి రమ్మని ఒత్తిడి చేశాడు. ఆ యువకుడు మొండికేసి.. చెట్టు ఎక్కి కూర్చున్నాడు. ఊరి జనమంతా అక్కడికి వచ్చి చేరారు. వెంటనే ఆ ఊరి పెద్ద.. ఆ యువకుడిని చెట్టు పైనుంచి కిందికి దూకమని కోరాడు. 'ఇంత ఎత్తు నుంచి దూకితే దెబ్బలు తగులుతాయి కాబట్టి.. నేను దూకను' అని మొరాయించాడు ఆ యువకుడు. అప్పటికప్పుడే ఊళ్లో యువకులు కొందరిని పురమాయించి, పెద్ద వల ఒకటి తెప్పించాడు ఊరిపెద్ద. పదిమంది వల పట్టుకోమని.. ఆ యువకుడిని దూకమన్నాడు. అతను మరో ఆలోచన లేకుండా చెట్టు పైనుంచి దూకాడు. ఏ గాయమూ కాలేదు. తర్వాత యువకుడిని పిలిచిన గ్రామపెద్ద.. 'మొదట దూకమంటే భయపడ్డావ్. వల పట్టుకోగానే దూకావు. ఆ వల లాంటిదే దైవం మీద నమ్మకం. మానవ మాత్రులమైన మనం జీవన సమరంలో ఎన్నో ఆటుపోట్లకు గురవుతుంటాం. ఎన్ని కష్టనష్టాలొచ్చినా ఆ దేవుడు మనల్ని కాపాడుతాడని నమ్మితే మనం ముందుకు పోగలం. సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. లేకుంటే సమస్యల దగ్గరే ఆగిపోతాం' అని వివరించాడు. 'దేవుడు ఉన్నాడన్న నమ్మకం మనకు బలాన్ని, సమస్యలను ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది' అనుకుంటూ అందరితో పాటూ గుడికి కదిలాడు.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

కృతజ్ఞులై ఉందాం

ఇస్లాం బోధ

ప్రవక్త మూసా (అలై) అల్లాహ్‌తో నేరుగా మాట్లాడారు కాబట్టి ఆయన్ను 'మూసా కలీముల్లాహ్' అని పేర్కొన్నది ఖురాన్. ఒకానొకసారి మూసా (అలై) అల్లాహ్‌తో మాట్లాడేందుకు తూర్ పర్వతం వైపునకు వెళ్లబోతుండగా ఓ వ్యక్తి అడ్డుపడి ''మూసా! నేను చాలా దారిద్ర్యంలో ఉన్నాను. నా దరిద్రాన్ని తొలగించమని అల్లాహ్‌కు చెప్పండి'' అని విన్నవించాడు. సరేనని ఆయన ముందుకు వెళ్లారు. అంతలోనే ఇంకో వ్యక్తి తారసపడి ''ఓ మూసా నా దగ్గర ఎన్నో ఆస్తులు పోగయ్యాయి. సిరిసంపదలు లెక్కకు మించి వచ్చి చేరుతున్నాయి. ఇక చాలు, అల్లాహ్‌కు చెప్పి వాటిని ఆపివేయించు'' అని చెప్పాడు. ప్రవక్త (అలై) సరేనని ఇద్దరి స్థితిని అల్లాహ్‌కు వివరించారు. దానికి అల్లాహ్ ''మొదటి వ్యక్తితో నాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండమని చెప్పు. రెండో వ్యక్తితో నాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడం మానుకోమని చెప్పు'' అని చెప్పి పంపించారు. మూసా మొదటి వ్యక్తి దగ్గరికొచ్చి ''అల్లాహ్ నిన్ను విరివిగా కృతజ్ఞతలు తెలుపుతూ ఉండమని చెప్పాడు'' అన్నారు. దానికా వ్యక్తి అల్లాహ్ నాకేమిచ్చాడని నేను కృతజ్ఞతలు తెలపాలని అడిగాడు. అంతోనే పెద్ద గాలి దుమారానికి అతని ఒంటిమీద ఉన్న దుప్పటి కొట్టుకుపోయింది. నగ్నంగా మారిపోయాడు. ఇక రెండో వ్యక్తి దగ్గరికి వెళ్లి 'అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం మానుకో' అని చెప్పాడు. దానికా వ్యక్తి ''అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం మానుకోవడమన్నది నా వల్ల కాదు. నాకు ఇన్నిన్ని అనుగ్రహాలు ఇచ్చిన ఆయనకు కృతజ్ఞతలు తెలపకుండా ఎలా ఉండను' అన్నాడు. దీంతో ఆయన మరింత సంపన్నుడిగా మారాడు.



''మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నుతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది'' (17:7) అని ఖురాన్ వివరిస్తుంది. అల్లాహ్ ఇచ్చిన అనుగ్రహాల పట్ల నిత్యం ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండాలి. 'మనం చేస్తున్న ఈ చిన్న ఉద్యోగమే ఎంతోమంది నిరుద్యోగుల కల అని మర్చిపోకూడదు. మనకు చూడటానికి రెండు కళ్లూ ఇచ్చాడు. ఎంతోమంది కళ్లు లేనివారు అంధకారంలో జీవిస్తున్నారు. మన దగ్గర రెండు చేతులున్నాయి. రెండు చేతులూ లేనివారెందరో దీనంగా బతుకులు వెళ్లదీస్తున్నారు. రెండు కాళ్లు లేని వాళ్లు అవిటితనంతో జీవితాన్ని లాక్కెళుతున్నారు. ఆత్మసంతృప్తితో, కృతజ్ఞతాభావంతో జీవిస్తే అంతకుమించిన సంతోషాలు ఇంకెక్కడా దొరకవన్నది ఖురాన్ సందేశం.

...✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076